నేను వినిపించుకోకుండా- 'అయితే, నేను మంచి మాట చేసిరానా?- వచ్చేటప్పుడు మందుసామాను ఏమన్నా కావాలంటే తెస్తాను-ఏం?'అని కదిలాను-

మహాకవి- ఎంతో ఆపదలోఉన్న ఖంగారుతో,- నన్ను నిలవేశాడు.

'మన్మథుడు, యీరాత్రికి నన్ను బ్రతకనిస్తాడంటావా?-' అని బ్రతిమాలుకున్నాడు.

'నీకా భయం. ఎందుకూ?-వాడి ఆయుధాలన్నీ యిటీవల యూనియన్ ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని పత్రికల్లో చదవలేదూ?-

'మనగదిలో పడుకుంటే, మన్మథుడు, తేరిచూడలేడోయ్!-ఆబాధ ఏదీ ఉండదు,-ఎలికలతోనే రగడ-కాని, అవి మామూలు ఎలికలనుకునేవ్-చౌశీతి బంధాలూ తృణ్ణంగా వచ్చిన ప్రోఢలు- ఏదో శాపం కొద్దీ-నందనవనంలో అచ్చర పిండంతా,- యిలా కిచకిచలాడుతూ - మన గదిని ఆశ్రయించిందేమోనని, - నా నమ్మకం - అయినా, అనుభవించబోతూ-'

నేను వేళాకోళానికి అంటున్నానని తెలిసికూడా, - మహాకవి కంగారైపోయినాడు - మూటాముల్లే కట్టుకుపోయి తెల్లవార్లూ స్టేషనులో అన్నా పడిఉంటానుగాని, యిక్కడ ఉండనన్నాడు - పరుపుచుట్ట బిగిస్తూ, నన్ను తిడుతున్నట్టు ఏదో సణుక్కున్నాడు - తిథివార నక్షత్రాలమీద నోరు చేసుకున్నాడు - తన జీవితంలో ఏ రాత్రీ యింత గొడ్డుపోలే

దనుకున్నాడు - అయినా, యిలాటి దద్దమ్మలు స్నేహితులైన తరువాత యింతకన్నా జరిగేదేముంటుందనుకుని, ఓపిక చేసుకుని నిట్టూర్చాడు -

ఈ హంగామా అంతా నేను చూసీ చూడనట్టు ఊరుకున్నాను: అంతా, సర్దుకోవడం అయిన తరువాత, -

'ఏం, రిక్షా కేక వేయనా?-' అన్నాను:

'నన్ను వెళ్లిపొమ్మన్నమాటా?-' మహాకవికి రోషం వచ్చింది -

'ఉండమంటే ఉంటావా?'

'అభయం యిస్తే - అగిపోనూ ?' ప్రాణం లేచివచ్చినట్టు బ్రతిమాలాడు -

'సరే - నేను బువ్వతిని రానీ - అప్పుడు ఆలోచించుకుందాం !'

'నువ్వు ఏవేళకు వస్తావో - ఏమో ? - నిన్ను నమ్ముకున్నాను - పస్తు పడేస్తే - ఆపాదిత్యం అంతా నిదే!-'

'మరేం ఫరవా లేదు - మన ప్రయత్నలోపం ఉండదు- ఆమీాద, - నీ అదృష్టం!-'

'అంతా నీచేతిలో ఉంది-'

"నీ గీతలో ఉంది!"

పక్కా- జామున్నరకు తిరిగివచ్చాను. మహాకవి, తగని ఆపసోపాలు పడుతున్నాడు. పద్యాల్లో పంచభూతాల్ని తిట్టడం మినహా తతిమ్మా హంగామా యావత్తు చేసేస్తున్నాడు.

'ఏంరా, బాబూ!- ఇవాళటికి, నేను బ్రతికి నట్టేనా!- ఎగిరి నా కంఠం పెనవేసుకున్నాడు- మనిషి సల సలా క్రాగి పోతున్నాడు.

'ఎలాగైతేనేం-చావు తప్పిందే అనుకో,-కాని,-కన్ను లొట్టపడితే-అది నీకర్మం-' చాలా విసుగ్గా అన్నాను.

'అంటే?-'

'అంతే-'

'అదేమిటిరా బాబూ!- పొడుపు కథల్లే మాట్లాడితే ఎలా?-అసలు సంగతి ఏమిటో చెప్పు-'

చెప్పరా బాబూ! అని కాలావేలాపడి బ్రతిమాల నిచ్చిన తరువాత, వాడికి చెప్పవలసిన మాట.- వాడికి చెప్పాను. అందుకు, సింగారించుకోమన్నాను- నీకు యీ రాత్రి ముచ్చటకు కానీ ఖర్చులేదు. పర్సు పట్టుకు వెళ్ళవల సిన అగత్యం లేదన్నాను. ఇక వెళ్ళిరమ్మన్నాను.

'ఎక్కడికి?- ఎవరాసుందరాంగి - మహాకవి మనసు ఎరిగి వర్తించగల 'జాణయేనా?-' ఈ ప్రశ్న లన్నింటికి జవా బుగా ఒక్కటే కసురు కసిరాను - మహాకవి, ఆపేక్షగా - 'అదేమిటిరా బాబూ !_ ఎందుకంత విసుగు ?' అని నోటితో అన్నట్టు అని,- 'నాకు ఉందనీ నీకు లేదనీ ఎందుకోయ్ ఆ ఏడుపు?-' అన్నట్టు నొసలుతో స్పష్టంగా యద్దేవా చేశాడు.

చాచి ఒక్కటి పుచ్చుకుని,- కుక్కిలో ఎత్తి కుదేసి,- వెన్ను వాచేటట్టు చిచ్చికొడదామని - చేతిదాకా వచ్చింది-

ఇంతలో, - వీధిగోడ అవతలనుంచి, 'బాబూ !' అని కేక వినపడ్డది.

'ఆ !' అని పలికాను. 'ఎవరది !' అని, మారు కేక వేశాను.

'నేనే నయ్యా ! - అప్పన్నని-

'రా,_ లోపలికిరా !' అంటూనే, మహాకవితో - 'అది గోనయ్యా ! - మీా ప్రియురాలు,- అందుబాటులో ఉన్న నెచ్చెలిని రాయబారం అంపింది. యిచ్చిందేదో ౹తాగు, పెట్టిందేమో తిను,- పక్క మరీసుతిమెత్తగా ఉంటే ఓకునుకు పట్టించుకో- లేపకముందే, లేచిరా-

ఇవన్నీ - ఈ హితోపదేశమంతా, తిట్లక్రింద జమ వేసుకుని,- మహాకవి, అవన్నీ దులుపుకుని,- అప్పన్నను అనుసరించాడు- నేను, మన మామూలు చాంద్రాయణ మంతాకానిచ్చి,- మామూలు వేళకే,- నిశ్చింతగా, నడుం వాల్చాను-

తెల్లవారుతూందనగా, నిత్యమూ, - దాసీపడుచు, కస- నలిగినపైట సర్దుకుంటూ, ఒళ్ళు తగని బద్ధకంగా విరుచు కుంటూ, వచ్చి, నిద్రమత్తు కేకవేస్తుంది- ఇవాళ, - అయ్యది రావడం ఆలస్యం చేసింది- ఆవేళకే, మహాకవి, కూనిరాగ ముతో,- మల్లెపువ్వల్లె,- చెక్కు చెదరకుండా, తిరిగివచ్చాడు- ఏనుగు నెక్కినంత సంబరాలతో వచ్చాడు.

'ఏమిటోయ్ !-విశేషం?-' అతడి వాలకంతో చిరాకు ఎత్తుకొచ్చి సణిగినట్టు అడిగాను.

'ఏమి టేమిటి?-జన్మకల్లా యిదే విశేషం!- పుట్టి బుద్ధెరిగిన తరువాత-యింత పుణ్యం చేసుకున్న పాపాన పోలేదురా, బాబా!-'

నేను మాటకు అడ్డం వెళ్ళాను-

'అన్ని మర్యాదలూ సరిగ్గా జరిగినట్టేనా?'- నేను అనడంమటుకు ఎక సెక్కెంగానే అన్నాను కాని,- మహాకవి,- అది లక్ష్యపెట్టే ధోరణిలో లేడు,

'ఆహా!- అన్నీ యథావిధిగా జరిగినాయ్!"

'అన్నీ!'- 'అ'నుకూడా వత్తి అడిగాను.

'ఏమిటి ఆకొంకెు ప్రశ్న?- ఎందుకు వెళ్ళానను కున్నావ్?-' తిప్పికొట్టా ననుకున్నాడు-

'ఏమో - ఎందుకన్నా వెళ్ళవచ్చు!- నీ పద్యాలు చదివి వినిపించావేమోనని అడిగా?-' మహాకవి,- మాట వింటూ - వింటూనే తెల్లమొగం వేశాడు - నేను ఇంకా సాగదీశాను.

'అయితేనేంలే? అది నీకు మామూలేగా! పోనీ?, తిన్నగా చూశారా?—

'దేవుడల్లే చూశారు. అందులో, మన ప్రతాపం ఏముందిలే!- అంతా,- నీ పలుకుబడి!-

'ఇదివరకు,- నా పద్యాల్ని విమర్శించిన హేమా హేమీలందరూ,- కనకం కాలిగోటికి బలాదూరు!- ఒక్కో క్షణంలో, నేను ఊహించని భావాలు ఎన్నో - ఎన్నెన్నో విప్పిచెప్పింది - టాగూర్, బారువా, హిమాంశురాయ్,

శశిధర ముఖర్జీ – ఇంకా ఎందరో మహాకవుల పద్యాల్లోంచి, గడగడా చదివింది.'

'పిల్లందరివీ పద్యాలా – పాటలా? – ఆడిందా! పాడిందా?–'

'ఏయ్– నీ టక్కరితనం నాకు తెలుసు గాని,–మాటకు అడ్డంరాక!– పూర్వకాలం పాటలీపుత్రంలో ఇలాటి రూపాజీవ లుండే వారనడమేకాని– కనకం,– వాళ్ళందరినీ మించిం దోయ్–'

'పేరు కనకం అని చెప్పిందా?'

'చెపితే ఏం?– అదికాదా?

'–కాకపోతేనేం– వట్టి కనకం కాదు, పరిమళించే పది యార్వన్నె మిసిమి– పసిండి–'

–'తెల్లవార్లూ ఇలాగే జాగరణ చేసి వచ్చావన్న మాట!——'

'వేయి రాత్రులైనా ఇలాగే గడప గలను– అది వేశ్యాగృహం కాదురా బాబా, సాక్షాత్ దేవతా మందిరం–'

నాకు వల్లమాలిన ఆశ్చర్యం వేసుకొచ్చిందని వాడు కనిపెట్టేంతవరకూ,– 'ఆ!' అని అలాగే గ్రుడ్లు అప్పగించి చూస్తున్నాను.

'నిజమేరాబాబూ, ప్రత్యక్ష అనుభవం – అక్కడ ఉన్నంతసేపూ, దేవతామూర్తి సన్నిధానంలో ఉన్నట్టు అనిపించింది; మనస్సుకు,– అంతరాత్మకు, ఎంతో అనిర్వచనీయ ఆనందం కలిగింది– అది,– ఏనాడో,– దేవాలయం!–'

'నిజము, మహాకవీ- చరిత్రగర్భంలో ఉన్న సత్యం - నిన్నుచూచి ప్రసవించింది. అది ఓనాడు దేవాలయమే!-' అతి వినయంగా, నమస్కారము చేశాను.

మహాకవి,- ఓ పట్టాన నిజమేనని నమ్మడానికి నిరాకరించాడు. ఒట్లూ సత్యాలూ వేయించుకుందామని పెనుగులాడాడు: ఈ ఐతిహ్యం, మన స్వంతానికి చెందింది కాదు గనక,- అంతకు నేను పూచీపడనన్నాను,- కాని, కథేమిటో చెప్తానని మొగ్గాను- ఆ చెప్పడమన్నా, అప్పుడు, నిలుచున్న పళాన కాదు,-నిదానంగా.

మహాకవికి,-కాఫీ త్రాగేందుకన్నా కన్ను తెరిపిని పడనంత బద్ధకంగాఉంది- హోటలులో కూర్చుని కునికిపాట్లు పడుతున్నాడు - బలవంతాన ఆవలిస్తున్నాడు-

ఎలాగో మూతి తుడుచుకుని, పిడిదికి, తూలుకుంటూ వచ్చి,- పక్కచుట్టమీద ఆనుకుని, లుంగల్లే నడుం వాల్చాడు-

'జాగారంవిశేషాలు ఏమిటోయ్?' - మహాకవి చిరాకుగా, కసురుగా, మూలిగి ఒళ్ళు విరుచుకుంటూ, పక్కకు దుర్చుకున్నాడు.

'తెల్లవార్లూ ఏంచేశారు ?' - బూతు విసిరినంత వడుపుగా అడిగాను - 'ఎన్ని వలపులు వలచావ్ ?'

మహాకవి, తన్నితే ఎగిరిపడ్డట్టు లేచి కూర్చున్నాడు-

'ఒరేయ్ !- నీ బుద్ధి ఎప్పుడూ ఇంతే !- నీకు, కుడీ ఎడమా లేదు; ఉచ్చ నీచాలంటూ లేవు- పరమ అప్రాచ్యుడవు !-'

కాకాయిని కసిరినట్టు కసిరితే - వాక్యం అక్కడికి తెగింది- 'బజ్జోరా, కన్నా! అంటూ, మొన్న ఆ సినీమా దేంట్లోనో యశోద ఉరిమినట్టు - కొంచెం ఊతంగా చిచ్చి కొట్టాను; నన్ను ఉద్ధరించినట్టు,- కళ్ళు మూశాడు-

రాత్రి మెయిలుకు, మహాకవి వెళ్ళిపోతాడని గట్టి నమ్మకం- కాని,- సంజెపడిన తరువాత రైలుమాట ఎత్తడం మానేసి,- మళ్ళీ నస మొదలుపెట్టాడు-

'నిన్న, చలిదీరిందికా,- మళ్ళా రాయబారం ఎందుకూ?- మహారాజల్లే పోయిరా !-' అన్నాను.

'పోయిరావడానికి అభ్యంతరం లేదు కాని,- ఎందుకైనా మంచిదని, అంటున్నాను- కాకిచేత కబురంపి తేచాలు,-' మహాకవి, యికిలించాడు-

'ఈ నగరంలో, కాకులు చీకటి తప్పులు చెయ్యావ్ ! నీవే దయచెయ్యి !-'

-మహాకవి నన్ను నిలవేసి కజ్జాకు దిగుదామనే ధోరణిగా మొగం పట్టాడు; కాని, అంత అదృష్టం లేకుండా,- 'అయ్యా, శాస్త్రుల్లగారూ' అని కేకవేసి, కేకను వెన్నంటి,- కనకం తల్లి గుమ్మం దగ్గిరికి వచ్చింది.

మహాకవి, గంపెడు బులబాటంతో,

'దయచేయండి - రండి, లోపలకి -' హడావుడిగా ప్రత్యుత్థానం చేశాడు -

'ఏం కోటమ్మా !- కుంకుమభరిణ లేకుండా వట్టిచేతులతో వచ్చావ్ !' అని పలుకరించాను _

'అదేమిటి అయ్యా !' అంటూ తెల్లబోయింది.

'—ఏం లేదులే !- అయ్యవారిని, పేరంటానికి పిలవ డానికి వచ్చానుకున్నా !-' అని మహాకవిపంక చూశాను : పట్ట పగ్గాలు లేకుండా ఉన్నాడు -

కోటమ్మ మెత్తగా నవ్వి, పరధ్యానంగా నిలుచుంది; నాకు చప్పున అసలు సంగతి జ్ఞాపకం వచ్చి—

'రా, - ఇలా కూర్చో - మీ వంశవృక్షం ఒక్కసారి విదుల్చు - అయ్యవారికి కుతూహలంగా ఉంది -' అని బల వంతం చేశాను: మహాకవి కూడా అదే తాళంవేశాడు-

కోటమ్మ, పొంకంగా కూర్చుని,- అభినయం పట్టే ముందు, సభను కలయజూచినట్టు, మెడ సవరించుకుని, నోరు విప్పింది -

"-కటాక్షాః వేంకటప్రభోః !_

శ్రీ వేంకటాద్రి ప్రభువుల కటాక్ష వీక్షణములు తమవంటి మహా - పండితులకు లక్ష్మీవిలాసములట - చిత్త గించారా బాబూ !-

ఆ ప్రభువుల ముని మనుమడు, - వారి హయాంలో ప్రేపల్లెవాడనుంచి, గోపాలకృష్ణమ్మను తెచ్చి ప్రతిష్ఠించి, - స్వామి కైంకర్యానికి, - మాకుకత్తుల మాన్యం సమర్పించు కున్నారయ్యా ! -

మా ముత్తవకు తల్లి, లక్ష్మీవిలాసం, నిత్యమూ స్వామివారిని నాట్యమాడి సేవించుకుంటూండేది :

ఎన్నడో ఓనాడు, - ప్రభువువారు, నాయకురాలిని తల ఊచి మెచ్చారయా !-చేరదీసి, స్వామిసాక్షిగా, కొంగు బంగారమైనారు :

మహారాణీ తల్లి, - ఆ పండుతల్లి ఈ సౌభాగ్యాన్ని సహించలేకపోయింది : ప్రభువువారు ఆ తల్లి విన్నపాలు ఆలకించలేదు రి.

స్వామివారి ఆలయం, శయ్యాభవనమైంది,-అపవిత్రమై పోయింది, అంటూ రాణివాసం, రాజధానిలో నీలాపనింద మోపింది : రాణువ అంతా మూర్ఛించింది, - మన్నె దొర లందరూ, ప్రభువుల ఆనతి తలదాల్చమన్నారు.

కాని, - ప్రభువులవారి మనస్సు చింతాకంతైనా చలించిందికాదు : లక్ష్మీమ్మ విలాసానికి అభయం ఇచ్చారు : ఇద్దరూ కూడి స్వామిని సేవించుకుంటున్నారు.

మహారాణి, అలుకచేసి, - పుట్టిన ఇంటికి తరలిపోయి నారు.

ఓపలేనిదని,-ప్రభువులు లాలనచేసి, నాయకురాలిని,- ఇక్కడికి రెండామడల్లో ఉన్న, మేనమామల యింటికి, పచ్చల పల్లకిలో ఫౌజును సాయమిచ్చి పంపారు.

అవి, మంచిరోజులు కావు, బాబూ !

ఎటుచూసినా దండుముఠాకలు -

పిండారీలు వచ్చి పడ్డారు ! గ్రామాన్ని నామరూపాలు లేకుండా చేశారు ! ప్రజలు అంతా కొండల్లో కోనల్లోపోయి, పరువు దాచుకుంది. నమ్మినబంటే లేకపాయె ! - ప్రభువు

వారు, అందరికీ దూరమైపాయె! - ఒక్క-రేం చేయగలరు? ఎల్లా అరికట్టగలరు ?

ఒరదూసిన కత్తి - ఒక్క-వ్రేటుకు పదిశిరస్సులు రాల్చిందటయ్యా! - దైవం హర్షిచేటట్టు, - దేవతలు పుష్ప వర్షం కురిపించేట్టు ప్రభువువారు విక్రమించారు : అయితేనేం, ఒక్క-రై పోయినారు :

ఆలయ ప్రాకారాలు, నేలమట్టమైపోయినవి : నిధి నిక్షేపాలకు ఆసపడి ఆ మూక అంత అఘాయిత్యం చేసింది : ప్రభువువారు,- ఆ సీమలోనే కొనఊపిరితో ఉన్నారు, పూచిన తంగేడల్లే !

దండువచ్చి పడ్డదన్న కబురు చూలాలుఉన్న గ్రామాన అందింది: ఈ వార్త చెవి సోకంగానే,- నాయకురాలు, సోలిపోయిందా,- లేదు,- అయినవాళ్లను వందమందిని ఆకట్టు కున్నది,- బాకూ బల్లెం అందిచ్చింది,- తానో కైజారు అందుకున్నది- ఏలే మహారాజుకు అండగావచ్చి వ్రాలింది-

అయ్యవారి స్థితి చూసింది: నాయకురాలు ఆవురు మనలేదు: అట్టే చూసింది:

ఆలయం ఉన్నచోట చూసింది : కన్ను తడి అయింది. సంబాళించుకుంది : కైజారెత్తి అయ్యవారికి మ్రొక్కింది- 'ఈ దాసికి ఏమి ముగుదల ?' అన్నది-

అయ్యవారు, చిక్క-బట్టుకున్న ఆ ఒక్క-ఉసురుతోనూ,- 'లక్ష్మి! స్వామిని దక్కించుకోలేక పోయినాము !' అన్నారు:

అయ్యవారి సరసను మోకరిలి నాయకురాలు అన్నది కందా- 'మాయామర్మమూ విడిచిన చోటు, మనసూ, మనసూ దక్కిన-చోటు,- ఆలయం, నాలోఉంది,- నీలోఉంది, నాయకుడా,- మన వంగసం కొలుచుకుంటుందయ్యా !-'

ప్రభువులు, రంభకు సరసులై వేంచేశారని-, నాయకురాలు, కోపం తాపం ఎరుగకుండా,- అక్కడే వసతి కల్పించుకుని - కన్నబిడ్డకు విద్యాబుద్ధులు నేర్పి,- అయ్యవారి పాదాలను గురుతుంచుకుని సేవించుకుంటూ అలాగే లీనమైపోయింది-

ఈనాటికీ,- సంజెదీపంవేళ,- మా కులపు సానికి,- చేయెత్తుతాము: ఆ అవ్వ ఔననేట్టు మెలగుతాము-

ఆనాటి మడిమాన్యాలు ఈనాటికి లేవు- మాట మాత్రం కలకాలం దక్కాలయ్యా !-"

కథ చెప్పడం అయిపోయింది : కోటమ్మ కొంచెంసేపు మౌనంగా, ధ్యానముద్రలో ఉండిపోయింది-

మహాకవి, - మలేరియా రసికుడల్లే - నిట్టనిలువున నీరసించిపోయినాడు- కోటమ్మ తనంతట తానే తెప్పరిలి, - వచ్చినపని యేమిటో చెప్పకుండానే, - సెలవు పుచ్చుకుంది-

'ఏం మహాకవీ ? - అత్తయ్య యెంత చిక్కని వాడుక భాష వాడిందో చూశావా ;-'

జవాబు చెప్పకుండా, - మూటాముల్లే సర్దుకుంటున్నాడు. 'అదేం ?'- అంటే, 'వెళ్ళిపోతున్నా' నన్నాడు - 'ఏం' అంటే, - జవాబు లేదు-

'ఇంతా విని, - వెళ్లిపోవడం ఇదేం సబబు మహాకవీ,- నీకోసం కనిపెట్టుకొని ఉంటారేమో !- ఈ సీమలో అధమం మూడునిద్రలైనా చెయ్యడం ఆచారం !

మహాకవి, - కస్సుమన్నాడు -

'ఇంతావిని, - మళ్లీ అపచారం చెయ్యమంటావా ?'

'చెయ్యకుండా ప్రయాణం కావద్దంటాను : ఇలాంటి రసవత్తర శృంగార ప్రబంధం ఆకర్ణించిన పిమ్మటకూడా దేవరవారి శీతోష్ణస్థితిలో మార్పు రాలేదంటే -'

'అదికాదు, బాబూ, ఆ యిల్లు పుణ్యక్షేత్రం - తుచ్ఛ వాంఛతో ఎలా వెళ్లగలను ?'

'గుమ్మం ఎక్కే ప్రతిసరసుడూ యిలాగే బెదిరిపోయి మడిగట్టుకుంటే - వాళ్లకు దినవెచ్చం ఎలాగడవను ?'

నే నేదో కాశీక్షేత్రంలో గోహత్యకు తలపెట్టినట్టు మహాకవి బాధతెచ్చుకున్నాడు.

'నీ వలా అనడం-వాళ్ళను బాజారీ రూపాజీవల క్రింద కట్టడం, ఎంత పాదిత్యానికి ఒడిగట్టావురా తండ్రీ !-' అంటున్నాడు.

నేను నవ్వాను - నవ్వు ఆపుకోవడం నాతరం కాక నవ్వాను- మహా కవి,- ఇక ఒక్క నిమిషం,- అక్కడ నిలువ నన్నాడు: నా మొగం చూస్తూంటే పంచ మహాపాతకాలూ చుట్టుకుంటున్నాయి.

మనం బ్రతిమాలడం,- గడ్డం పుచ్చుకునీ, సందిట హోల్డాల్ లాక్కునీ,- అతడు ససేమిరా ఉండనంటూ గింజు

కోవడం— ఈ సందడిలో పుణ్యకాలం కాస్తా దాటిపోయింది: కోడికూసే వేళకు కాని, మరో బండీ లేదు—

అయినా, — మహాకవి నిలిచేట్టు లేడు —

'ఇంటికి జేరుకోవాలి — విన్న కథంతా అఖండ ఖండ కావ్యం చేయాలి — కనకానికి అంకితం చెయ్యాలి — అందాకా నిద్రపట్టదు — అంతేకాదూ ?—' మహాకవి, మాట విని పించుకోనట్టు ఊరుకుని, — రిక్షావాణ్ణి పిలిచి సరంజామా అందిచ్చాడు.

'ఒక్క సంగతి మరచిపోకూడదు, మహాకవీ — ఆ కథ హక్కు—భుక్తాలన్నీ మనవి !—'

మహాకవి — స్తంభించిపోయి — 'అంటే :'— అని ఎక్కిళ్లు వచ్చినట్టు అన్నాడు —

'అంటే — నీవు ఏ తెలుగుపత్రికా చూసిన పాపాన పోవని అర్థం !—'

మహాకవి, — గుక్క తిప్పుకుని,—

'ఇదంతా, — నీ నాటకమా ?' అని కాల్చేట్టు అన్నాడు —

'మన — ఆతిథ్యం — !— మళ్లీ ఎప్పుడు రాక ?—'

మహాకవి, — రిక్షాలో ఎగిరికూర్చుని, — జట్కా వేగాన తోలుకుపోయినాడు.

—తీరికగా, కోటమ్మయింటికి వెళ్ళాను —

ఎవరో వృద్ధసరసుడు, — సావడిలో కూర్చుని ఉన్నాడు, బత్తాయి తొనలు వల్చుకుతింటూ : కోటమ్మ అతి పెద్ద

ముత్తైదువల్లే, – ఎడంగా నిలుచుని, – అధ్యాత్మరామాయణం వేమనపద్యాలూ రంగరించి, – వేదాంతం మాట్లాడుతూంది–

నన్ను చూడగానే ముసలి రసికుడు ఉలిక్కిపడ్డాడు : కోటమ్మ నిదానంగా, – అతి ఆప్యాయనంగా దయచేయమంది : 'అయ్యవారే, – అమ్మాయిని చేరదీసింది – మాకు మహారాజపోషణ : ఉదయమే, స్వగ్రామంనుంచి దయచేశారు –' అంటూ ఆ పెద్దమనిషికి చేయెత్తి దణ్ణంపెట్టింది –

'మా గురుపుత్రులు –' అంటూ నన్ను చూపించింది. 'బాబూ ! – కాఫీ పుచ్చుకోరూ ?' – అన్నది. నేను అక్కర్లేదన్నాను. ఇంతలో, – కనకం వచ్చింది – రసికుడు, – బెరుకు బెరుకుగా చూసి, – ఊరుకున్నాడు –

'ఏం మహాకవీ !' అని పలుకరించాను; కనకం ఫక్కున నవ్వింది – కులకబోయి, – అట్టె సంబాళించుకుంది –

అదేమిటి ? – అన్నట్టు కోటమ్మవంక చూశాడు, – ఆ మారాజు –

'దుర్గమ్మకు అదో ముద్దుపేరు బాబూ – అబ్బాయిగారు, – ఈ యీడునుంచీ పిల్లదాన్ని ఎరుగున్నారు–' అని,– ఏ రెండుమూడేళ్ల ప్రాయపు ఎత్తో అభినయించి చూపించి, – కోటమ్మ సర్ది చెప్పింది – నన్ను సాగనంపడానికి, – గుమ్మందాకా వచ్చింది :

తృణమో పణమో ముట్టచెప్పాను : తృప్తిగా పుచ్చుకుంది – మహాకవి మాట తలచుకుని, – ఆయన గొణగొణ

తలచుకుని, నవ్వింది - 'ఆ కబుర్లు కామరాజు ఎక్కడ దొరి కాడు మనకు బాబూ!' అంది.

'ఆయన మహాకవి! - అలాటివాళ్లు సాధారణంగా ఏ కొంపైనా పాదధూళితో పవిత్రం చేస్తారు కాని. - పక్క ధ్వంసం చెయ్యరు - మనం అంటావ్రా, - ఏదో యీ గూపేణ కొంత సాహిత్యసేవ చేస్తున్నాం - అంతే!-'

కోటమ్మ పలు విప్పకుండా నవ్వింది - నేను పుట్టక ముందు,-మా పెద్ద మేనమామ వంక చూసినట్టు-చూసింది -

ఇంటికి వచ్చి పడుకున్నాను - తెల్లవార్లూ మహాకవి విశ్రమించిన మేరంతా, ఎలుకలు అతివిరహంగా కిచకిచలాడు తున్నాయి -